ప్రమాదం జరిగితేగానీ పట్టించుకోరా?



రోజ్ కాలనీలో తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

కవాడిగూడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రోజ్‌కాలనీలో తుప్పుపట్టిన విద్యుత్ స్తంభం స్థానికులకు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. (ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ స్తంభం అడుగున తుప్పుపట్టి ఒకవైపునకు వంగిపోయింది. దీంతో ఈ స్తంభం ఎప్పుడు కూలిపోయి ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని బస్తీవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. స్తంభం

పబ్లిక్ వాయిస్

పడిపోకుండా బండరాళ్లు, చెక్కలను స్థానికులు రక్షణగా పెట్టారు. ఈదురు గాలులతో వర్షం వచ్చినప్పుడల్లా స్తంభం కూలిపోతుందేమోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నామని బస్తీవాసులు వాపోతున్నారు. తుప్పుపట్టిన స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని పలుమార్లు ట్రాన్స్ కో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.



కవాడిగూడ డివిజన్‌లోని రోజ్ కాలనీ

కొత్త స్తంభం ఏర్పాటుకు కృషి చేస్తా..



లోయర్ ట్యాంక్‌బండ్ రోజ్ కాలనీలో తుప్పపట్టిన విద్యుత్ స్తంభం సమస్యను ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం చేయడం తగదు. భారీ వర్షాలు కురిసిన సమయంలో ఈ స్తంభం కూలిపోతే ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. కొత స్తంభం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా.

- జి.రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

పారిశుధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు

- ప్రజలు చెత్తను స్వచ్ఛ ఆటోలోనే వేయాలి
- ముషీరాబాద్ సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ



రాంనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో పారిశుధ్య సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని, ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా స్వచ్ఛ ఆటోలోనే వేయాలని ముషీరాబాద్ సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ (ఏఎంవోహెచ్) డాక్టర్ ప్రవీణ సూచించారు. సర్కిల్ పరిధిలోని రాంనగర్, అడిక్‌మెట్, ముషీరాబాద్, బోలక్‌పూర్, కవాడిగూడ, గాంధీనగర్ డివిజన్లలో చెత్తను ఏ రోజుకు ఆ రోజు తరలిస్తున్నామన్నారు. అంటు వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో పారిశుధ్య సమస్య శాశ్వత పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై ఆమె 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో ఎన్ని జీవీపీ పాయింట్లు ఉన్నాయి, అక్కడి నుంచి చెత్త సేకరణ ఎలా జరుగుతుంది?

సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లలో 65 చెత్త సేకరణ (జీవీపీ) పాయింట్లు ఉన్నాయి. ఇక్కడి నుంచి చెత్తను ప్రతి రోజూ సేకరించి వాటిని డంపింగ్ యార్డుకు తరలించే చర్యలు కొనసాగుతున్నాయి. ఇందుకోసం ప్రత్యేక సిబ్బంది, వాహనాల వ్యవస్థ ఉంది.

సర్కిల్ పరిధిలో ఎన్ని స్వచ్ఛ ఆటోలు ఉన్నాయి. వాటితో చెత్త సేకరణ ఎలా సాగుతుంది?

సర్కిల్ పరిధిలో 138 స్వచ్ఛ ఆటోలు పనిచేస్తున్నాయి. ఈ ఆటోలకు కేటాయించిన బస్తీలు, కాలనీలలోని ఇళ్ల నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు చేరవేస్తాయి. ప్రతి రోజూ వీటి ద్వారా చెత్త సేకరణ జరుగుతుంది. ప్రజలందరూ విధిగా తమ ఇళ్లలోని చెత్తను స్వచ్ఛ ఆటోలో వేయాలి.

సర్కిల్ పరిధిలో ఎంతమంది స్వీపింగ్ కార్మికులు ఉన్నారు, వారి ద్వారా రోడ్లను ఊడ్చే కార్యక్రమం ఎలా సాగుతుంది?

సర్కిల్ పరిధిలో మొత్తం 750 మంది స్వీపింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరు ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తమకు కేటాయించిన బస్తీలు, కాలనీలలో రోడ్లు ఊడ్చే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వీరిని ఎస్ఎఫ్ఏలు పర్యవేక్షణ చేస్తారు. వారితోపాటు తాను కూడా రోజూ పర్యవేక్షిస్తాను.

అధికంగా చెత్త ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సర్కిల్ పరిధిలోని అజామాబాద్, పార్సిగుట్ట, జెడ్‌బీగార్డెన్ ప్రాంతాలలోని ఖాళీ స్థలాల్లో చెత్తను తొలగించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. ఈ ప్రాంతాలలో చెత్త వేయకుండా కెమెరాలు, మైక్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



సుధీర్‌కుమార్‌రెడ్డి

చిక్కడపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు దేశవ్యాప్తంగా మెరుగైన భద్రతా చర్యలను తీసుకోవాలని ప్రముఖ చీఫ్ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ కె.సుధీర్‌కుమార్‌రెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో 'రోడ్డు ప్రమాదాలు- దేశవ్యాప్తంగా మెరుగైన భద్రతాచర్యలు' అనే అంశంపై ఆయన మాట్లాడారు. భారతదేశం అంతా రోడ్డుప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో ఆందోళన వ్యక్తం చేశారు. 2022లోనే దేశంలో 4,61,312 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని వివరించారు. వీరిలో 1,68,491 మంది మరణించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పీఆర్‌వో శివ చిల్లతోపాటు పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మూసీ బాధితులకు ప్రజలు అండగా నిలవాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, బీజేపీ నేతలు

చిక్కడపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మూసీ నది బాధితులకు ప్రజలు అండగా నిలవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనీ వినయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మూసీ నది ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 25న ఉదయం 9 గంటలకు ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిర్వహిస్తున్న మహాధర్నాకు గాంధీనగర్ డివిజన్ పరిధిలోని ప్రజలు భారీగా తరలిరావాలని ఆమె కోరారు. ఈ మేరకు గురువారం డివిజన్‌లోని అరుంధతినగర్, సబర్మతినగర్ బస్తీలలో బీజేపీ నాయకులతో కలిసి ఆమె పర్యటించి బీజేపీ మహాధర్నా కరపత్రాలను పంచిపెట్టారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, ఉమేష్, ఆనంద్‌రావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు పనులను పూర్తి చేయండి



విద్యుత్ అధికారులతో సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడ డివిజన్‌లో వెలగని వీధి దీపాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆదేశించారు. గురువారం నింబోలిఅడ్డలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో విద్యుత్ డీఈ అశోక్, ఏఈ సౌమ్యలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

'సంక్షేమ వసతి గృహాలను సీఎం పరిశీలించాలి'

అంబర్‌పేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల స్థితిగతులను సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పరిశీలించాలని ఈబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి మార్పు రాలేదని ఆయన వాపోయారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

బర్కత్‌పుర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అడ్మిన్ ఎస్ఐ కె.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ డీమార్ట్ వద్ద ఫుట్‌పాత్‌పై 50 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్ తెలిపారు.

- **బీజేపీ సభ్యత్వ నమోదు**



బాగ్‌అంబర్‌పేటలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జి.మల్లేష్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి అచ్చిని రమేష్ తదితరులు

- నల్లకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)



- బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం అంబర్‌పేట డివిజన్ ఆజాద్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లి బీజేపీ సభ్యత్వం చేయించిన బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దాసోజు నాగభూషణంచారి, నాయకులు వినోద్ యాదవ్, ఉపేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- అంబర్‌పేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)

- **ఆర్థిక చేయూత**



ప్రపంచంలోని ఏడు ముఖ్యమైన ఛానెల్స్‌లో ఇంగ్లిష్ ఛానెల్ మినహా మిగతా ఆరు ఛానెల్స్‌ను ఈదడమే లక్ష్యంగా పెట్టుకున్న బర్కత్‌పురకు చెందిన గంధం క్విని విక్టోరియాకు తనవంతుగా రూ. 25వేల నగదు అందజేస్తున్న అఫ్జల్‌గంజ్ సీఐ జి.లింగేశ్వరరావు

- బర్కత్‌పుర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి)



సుందరయ్యపార్కులో జైసింహాతో కేక్ కట్ చేయిస్తున్న తల్లిదండ్రులు ఎమ్మెల్యే ముఠా గోపాల్, సరోజిని దంపతులు



ముఠా జైసింహను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ యువజన నాయకుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు



చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహకు ఆశీర్వచనం అందజేస్తున్న వేదపండితులు

బీఆర్ఎస్ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తా

- జన్మదిన వేడుకల్లో యువనేత ముఠా జైసింహ
- పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన ఆ పార్టీ యువజన నాయకుడు ముఠా జైసింహ



కవాడిగూడ సాయిబాబా ఆలయంలో ముఠా జైసింహతో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష కార్యదర్శులు శ్యామ్‌యాదవ్, సాయికృష్ణ, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

రాంనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీ కోసం అంకిత భావంతో పనిచేస్తానని బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ నాయకత్వంలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావడం కోసం అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. గురువారం సుందరయ్యపార్కు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్.వివేక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే ముఠా గోపాల్, సరోజిని దంపతులు హాజరై జైసింహతో కేక్ కట్ చేయించారు. జైసింహ యువసేన నాయకులు శ్రీదర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జైసింహ పాల్గొని కేక్ కట్ చేశారు. రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు టి.శంకర్ ముదిరాజ్ జైసింహను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెనిశెట్టి సుధాకర్‌గుప్తా, డి.రవి యాదవ్, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, దీన్‌దయల్‌రెడ్డి, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, బొట్టు శ్రీనివాస్, కె.సురేందర్, ఆర్.వివేక్, బబ్లూలు జైసింహను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు

చిక్కడపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ జన్మదిన సందర్భంగా చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ముఠా గోపాల్ కుటుంబసభ్యులకు ఆలయ వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, సాయిచాణిక్యరెడ్డి, కేశవపురం అరుణ్, వల్లాల శ్రీనివాస్ యాదవ్, దీన్‌దయాళ్‌రెడ్డి, బల్ల ప్రశాంత్, కరికె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయం వద్ద భక్తులకు అన్నదానం

కవాడిగూడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఠా జైసింహ జన్మదినం సందర్భంగా గురువారం కవాడిగూడ డివిజన్ బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో సాయిబాబా దేవాలయంలో ముఠాజైసింహతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ముఠాజైసింహతో పాటు కవాడిగూడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ప్రధానకార్యదర్శి ఎన్‌డీ సాయికృష్ణ, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, దుర్గాస్వామి, సంతోష్‌కుమార్, డాక్టర్ శ్రీహరి, రవి యాదవ్, ప్రవీణ్‌గౌడ్‌తో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం పేదలకు, భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ముఠాజైసింహ ప్రారంభించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సైనికుల్లా పనిచేయాలి : మాజీ మంత్రి కేటీఆర్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన ముఠా జైసింహ, దీన్‌దయాల్‌రెడ్డి

ముషీరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ తన జన్మదినం సందర్భంగా కేటీఆర్‌ను కలిసి సన్మానించారు. ఈసందర్భంగా కేటీఆర్‌కు పూలబొకే అందజేసి స్వీట్ తినిపించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ... నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్న నాయకులకే ప్రజల్లో ఆదరణ ఉంటుందన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, అరుణ్, సాయి చాణిక్యరెడ్డి, మైకల్ ఉన్నారు.

- భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ముఠా జైసింహను పల్లకిలో ఊరేగించారు.

ఉదయనగర్, పవిత్రనగర్‌లో రోడ్లకు మరమ్మతులు



రోడ్లపై గుంతలు పూడ్చే పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాంనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'అధ్వాన్నంగా ఉదయ్‌నగర్, పవిత్రనగర్ కాలనీల రోడ్లు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి స్పందించారు. ఈ సమస్యను జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయ్‌నగర్ కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు నరేష్‌గౌడ్, శ్రీకాంత్ గుప్తా, పవిత్రనగర్ కాలనీ అధ్యక్షుడు రత్నాకర్ మాట్లాడుతూ తమ సమస్యలను కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసినందుకు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

'సామాజిక న్యాయం కోసం సమాజ్‌వాదీ పార్టీకి మద్దతివ్వండి'

రాంనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సామాజిక న్యాయం జరగాలంటే రాష్ట్రంలో సమాజ్‌వాదీ పార్టీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని సమాజ్ వాదీ పార్టీ అడ్వకేట్ ఫోరం జాతీయ అధ్యక్షుడు కృష్ణకన్నయ్య పాల్ కోరారు. గురువారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర సమావేశం అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కృష్ణకన్నయ్య పాల్ హాజరై మాట్లాడారు. మాట్లాడుతూ బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కులు కరువయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రీ, తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్.వి.విశ్వేశ్వర రావు, పార్టీ ప్రధాన కార్యదర్శి అక్కల బాబుగౌడ్, నాయకులు డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ తాటికొండ వెంకటరాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పునస్సమీక్షించాలి

- నవంబరు 24న భారీ బహిరంగసభ

కవాడిగూడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునసమీక్షించాలని, ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబరు 24న గ్రేటర్ హైదరాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగసభకు మాల సామాజికవర్గం వారు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక యాక్షన్ కమిటీ చైర్మన్ మన్నె శ్రీదర్ కోరారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 24న గ్రేటర్ హైదరాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగసభకు ఐదు లక్షల మందిని తరలించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ ప్రత్యేక బాధ్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ బలవంత్‌రావు, కో కన్వీనర్లు తాలుకా రాజేష్, గోకుల కల్యాణ్, అంజలి, బిట్ల నర్సింగ్, సహదేవ్, శాస్త్రీ ప్రవీణ్, ఎస్.చెన్నయ్య, గంట మోహన్‌రావు, మహేష్, త్యాగరాజు, రాజు, సురేష్, నర్సింగ్ రావు పాల్గొన్నారు.

వరదనీటి నాలాల సమస్య పరిష్కారానికి కృషి



నాలా పైకప్పు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరద నీటి నాలాల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారం తొలగించడంతోపాటు శిథిలావస్థకు చేరుకున్న నాలా పైకప్పు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపాదికన ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. గురువారం బోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లో రూ.62లక్షలతో వంద మీటర్ల పొడవున నాలాపై కప్పు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ గౌసుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, డివిజన్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, చాంద్, రాష్ట్ర మైనార్టీ కమిటీ మాజీ కార్యదర్శి షరీఫ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు మగ్బూల్, మీడియాసెల్ ఇన్‌చార్జి ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

నల్లకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని గాంధీనగర్ లంక బస్తీలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అజామాబాద్ డీఈ కమల్ కుమార్, ఏడీఈలు శ్రీనయ్య, శ్రీనివాస్, నాగేశ్వర రావు, ఏఈలు శ్రీనివాస్, శివశంకర్ పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని గాంధీనగర్(లంక)బస్తీలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ మీటర్ల ఏర్పాటు సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. గురువారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించి గాంధీనగర్(లంక) బస్తీలో విద్యుత్ మీటర్ల విషయమై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్ డీఈ కమల్‌కుమార్, ఏడీఈలు కె.శ్రీనయ్య, శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఏఈలు శ్రీనివాస్, శివశంకర్, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రిక్షాల పంపిణీ



పారిశుధ్య కార్మికుల రిక్షాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు

అంబర్‌పేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ స్వచ్ఛా డివిజన్‌గా రూపొందించడానికి పారిశుధ్య కార్మికులు తమవంతు సహకారం అందించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో గురువారం పారిశుధ్య కార్మికులకు గార్బేజ్ లిఫ్టింగ్ రిక్షాలను కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, బి.పద్మతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతి దివాకర్, ఏఎంవోహెచ్ డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.



- ఉస్మానియా యూనివర్సిటీ ఇండోర్ స్టేడియంలో జరిగిన తైక్వాండో టోర్నమెంట్‌లో బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎస్.నితిష్‌కుమార్ అండర్ 80 కేజీల కెటగిరీలో గోల్డ్ మెడల్, బి.గౌరీ 54 కేజీల కెటగిరీలో సిల్వర్ మెడల్, ప్రణయ్ 80 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, ఎ.పురుషోత్తం 68 కేజీల విభాగంలో బ్రౌన్ మెడల్, 63 కేజీల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుచుకున్నారు. గురువారం వారిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ సరోజ, కళాశాల అధ్యాపకులు సన్మానించి షీల్డ్ అందజేశారు.

- రాంనగర్ (ఆంధ్రజ్యోతి)

దోమలగూడ డీఐగా శ్రీశైలంనాయక్



డీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీశైలంనాయక్

కవాడిగూడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దోమలగూడ పోలీస్ స్టేషన్ నూతన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా తేజావత్ శ్రీశైలం నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన శ్రీశైలంనాయక్ సనత్‌నగర్ ఎస్ఐగా, నాచారం, కుషాయిగూడ, ఎల్బీనగర్, ఇబ్రహీపట్నం, మల్కాజిగిరి, కేపీహెచ్‌బీలో పనిచేశారు. రాచకొండ ఇన్‌స్పెక్టర్‌గా, చిలకలగూడ డీఐగా, మహేశ్వరం జోన్‌లో ఎస్‌బీ సీఐగా పనిచేసిన ఆయన బదిలీపై వచ్చి దోమలగూడ పీఎస్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

ప్రగతిశీల సామ్యవాదశీలి గుంటూరు శేషేంద్ర



మాట్లాడుతున్న గౌరీశంకర్

చిక్కడపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు శేషేంద్రశర్మ ప్రగతిశీల సామ్యవాద శీలి అని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ప్రొ. టి.గౌరీశంకర్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం గానసభలో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా మహాకవి గుంటూరు శేషేంద్రశర్మ యాదిలో పేరిట సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య గౌరీశంకర్ మాట్లాడుతూ శేషేంద్రశర్మ సంస్కృతాంధ్రభాషా సాహిత్యాలలో ఉద్దండ పండితులు అన్నారు. కళాభిమాని వి.వెంకటరరావు, గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి పాల్గొన్నారు.

'సాహిత్యప్రతిభతో పద్మభూషణ్ స్థాయికి బోయిభీమన్న'

చిక్కడపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తన సాహిత్యప్రతిభతో పద్మభూషణ్ స్థాయికి బోయిభీమన్న ఎదిగారని తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డా. వెలుదండ నిత్యానందరావు అన్నారు. గత కాలంలో ఉన్న వివక్షత నేడు అంతగా లేదని అప్పటి బాధలను అనుభవిస్తూ భీమన్న ఉన్నతస్థానానికి చేరుకున్నారన్నారు. భీమన్న సాహితీ నిధి, కళానిలయం ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో మహాకవి పద్మభూషణ్ బోయి భీమన్న జయంతి సందర్భంగా సాహితీవేత్త ఓలేటి పార్వతీశంకు భీమన్న పురస్కార ప్రదానం సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నిత్యానందరావు పురస్కారం బహూకరించి మాట్లాడారు. భీమన్న సాహిత్యప్రక్రియలు అన్నీ సృషించారని తొలినాళ్లలో పాత్రికేయ వృత్తిలో కూడా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టి.గౌరీశంకర్, హైమవతి భీమన్న, శోభా, సత్యనారాయణ, సురేందర్ పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యగురువు మృతికి సంతాపం

చిక్కడపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి అగ్రహారికులు, ప్రముఖ కూచిపూడి నాట్యగురువు మహంకాళి శ్రీమన్నారాయణ మూర్తి(85) బుధవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ బాపట్లలో పరమపదించారని, ఆయన మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు ప్రముఖ నాట్యగురువు, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డా. ఎస్‌పీ భారతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ ప్రదానం చేసిన అమృతపురస్కారం పొందిన ఏకైక కూచిపూడి గురువు మహంకాళి శ్రీమన్నారాయణ మూర్తి అన్నారు.

పారామెడికల్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ: ప్రైవేట్ పారామెడికల్ కాలేజీల్లో పారామెడికల్ డిప్లొమా కోర్సుల అడ్మిషన్ల కోసం దరఖాస్తులు సమర్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని, అన్ని సర్టిఫికెట్లు జతపరిచి వంద రూపాయల నగదు చెల్లించి ప్యాటీ సెంటర్‌లోని హరిహర కళాభవన్ 4వ అంతస్తులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. తెలంగాణ మెడికల్ బోర్డు వెబ్‌సైట్ www.tgpmb.telangana.gov.in నుంచి దరఖాస్తులను పొందవచ్చునని, వీటిని ఈనెల 30వ తేదీలోగా సమర్పించాలని కోరారు.